# హక్కులపై అవగాహన ఉండాలి



నవేగాం గ్రామంలో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

- రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్
- నవేగాం గ్రామంలో అవగాహన

రెబ్బెన, సెప్టెంబర్ 30 : హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నవేగాం గ్రామంలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవం (సివిల్ రైట్స్ డే) పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి పౌరుడు తన హక్కులు వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా గ్రామానికి రావడంతో సర్పంచ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నవేగాం గ్రామ సర్పంచ్ వడై మాధవితో పాటు పలువురు ఉన్నారు.

## నేటి నుంచి జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

ఆసిఫాబాద్,సెప్టెంబర్ 30 : జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు ఈ నెల 1నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్టు 1861 అమల్లో ఉంటుందని ఏఎస్పీ అచ్చేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి , పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ మీటింగు, ఊరేగింపులు, ధర్నాలు చేయవద్దని, నిషేధిత ఆయుధాలు కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు పేలుడు పదార్థాలు, నేరానికి పురిగొల్పే ఎలాంటి ఆయుధాలు వాడవద్దని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేలా చేస్తే వారి చర్యలు తప్పవని హెచ్చరించారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సింగరేణి డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏరియా అధికారులు

రెబ్బెన, సెప్టెంబర్ 30 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), శ్రీనివాస్ (ఆపరేషన్స్) లతో స్వచ్ఛత ఉద్యమం నిర్వహణ పై శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఏరియా డీజీఎం రెడ్డి మల్ల తిరుపతి తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ, డీజీఎం(సివిల్) సతీశ్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, సివిల్(ఈఈ) మనోజ్‌కుమార్ ఉన్నారు.

## ఇంకుడు గుంత నిర్మించుకోవాలి



కొలాంగురిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీపీ మోతీరాం, సర్పంచ్ నాణేశ్వర్

కెరమెరి, సెప్టెంబర్ 30: ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం అన్నారు. మండలంలోని కొలాంగురి గ్రామ కమ్యూనిటీ హాల్‌లో నిర్మించిన ఇంకుడు గుంతను గురి సర్పంచ్ కుమ్రం నాణేశ్వర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు ఆవరణలో నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతల్లో వెళ్లేలాగా నిర్మిస్తే దోమలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చన్నారు. ఇల్లుతో పాటు పరిసరాల శుభ్రత పాటించేలా చూడాలని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి రక్షించేలా కృషి చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మహ్మద్ వాజిద్, గ్రామస్తులు ఉన్నారు.

## కళాశాలలో ముగ్గుల పోటీలు

రెబ్బెన, సెప్టెంబర్ 30: స్వీప్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించి, విద్యార్థులతో ఓటు పై చిన్ననాటిక ప్రదర్శించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్, స్వీప్ ఇన్‌చార్జి అధ్యాపకుడు ప్రకాశ్ తెలిపారు. ముఖ్యంగా యువత ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

## నాగెపల్లిలో వైద్య శిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్



విద్యార్థులకు సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

కౌటాల, సెప్టెంబర్ 30 : 'ఆయుష్మాన్‌భారత్'లో భాగంగా మండలంలోని నాగెపల్లి గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు బాబాపూర్-గంగాపూర్ వైద్యాధికారి అజ్మీరా రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు, అదేవిధంగా విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు, వ్యాయామం, సైక్లింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా టీబీ, లెప్రసీ, బీపీ తదితర వ్యాధి పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిహారిక, ఏఎన్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిడుగు పడి ఒకరి మృతి

కౌటాల, సెప్టెంబర్ 30 : మండలంలోని ముత్తంపేట గ్రామ శివారులో పిడుగుపడి అదే గ్రామానికి చెందిన ధోని సత్తయ్య (40) అనే రైతు మృతి చెందాడు. సత్తయ్య తన చేను లో పురుగుల నివారణ మందు కొట్టి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. గ్రామానికి దగ్గరకు రాగానే చెరువు కట్ట సమీపంలో ఒక్క సారిగా పిడుగుపడడంతో సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## చెక్‌పోస్ట్ ప్రారంభం



చెక్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న ఏజీఎం తిరుమల్‌రావు

రెబ్బెన, సెప్టెంబర్ 30 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో విధులు నిర్వహించే ఎస్అండ్‌పీసీ సిబ్బంది సౌకర్యార్థం నూతన చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని బెల్లంపల్లి ఏరియా ఏజీఎం తిరుమల్‌రావు అన్నారు. గోలేటి సీహెచ్‌పీలో సుమారు రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్అండ్‌పీసీల చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియా డీజీఎం(సివిల్) సతీశ్‌బాబు, డీజీఎం(సీహెచ్‌పీ) భీంరావుజాడే, సీనియర్ సెక్యూరిటీ అధికారి వరప్రసాద్, సివిల్(ఈఈ) రాజేంద్రప్రసాద్, గోలేటి సీహెచ్‌పీ(ఈఈ) రాజు, వివిధ కార్మిక సంఘాల నాయకులు మాంతు సమ్మయ్య, మెరుగు రమేశ్, ఆరీఫ్, రామయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

# మండలానికి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు



రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు

రెబ్బెన, సెప్టెంబర్ 30 : తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నది. ఇందులో భాగంగా కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రతి ఊరిలో క్రీడామైదానాల కోసం ప్రభుత్వ స్థలాలు గుర్తించారు. డిస్కస్ త్రో, క్రికెట్, వాలీబాల్ కిట్లు, డంబుల్స్, టెన్నీకాయిట్, స్కిప్పింగ్, ప్లాస్టిక్ విజిల్స్, స్టాప్ అండ్ గో వాచ్, టీ షర్ట్స్‌తో కూడిన కిట్లు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి.

### ఆదేశాలు రాగానే పంపిణీ..



తెలంగాణ సర్కారు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అలాగే వారికి అందించేందుకు ప్రభుత్వ మంజూరు చేసిన క్రీడా పరికరాలు కార్యాలయానికి చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అయా గ్రామ పంచాయతీలకు క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తాం.

-పరికిపండ్ల శ్రీనివాస్, ఎంపీడీవో, రెబ్బెన

## బదిలీలు సహజం



విరమణ పొందిన ఉద్యోగితో అధికారులు, ఉద్యోగులు

రెబ్బెన, సెప్టెంబర్ 30: ఉద్యోగంలో బదిలీలు సహజమని ఎంవీటీసీ మేనేజర్ విజయ్‌సింగ్ ఇందా అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఎంవీటీసీలో హెడ్ ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహించి విరమణ పొందిన జలపతిరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి విరమణ అనంతరం ప్రతిఒక్కరూ ఆరోగ్యం, ఆధ్యాత్మికతపై దృష్టి సారించి, శేష జీవితం సంతృప్తిగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంవీటీసీ ట్రైనింగ్ ఆఫీసర్ మేడ రమేశ్, ఇన్‌స్ట్రక్టర్ మల్లరాజు శ్రీనివాసరావు, క్లర్క్ ఆకుల సత్యనారాయణ, సిబ్బంది పార్వతి, మారుబాయి ఉన్నారు.

## దళితులకు ఉచిత విద్యుత్ అందించాలి

రెబ్బెన, సెప్టెంబర్ 30: జీవో నంబర్ 342 ప్రకారం దళిత కుటుంబాలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ కోరారు. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రెబ్బెన విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ శిరీషకు శనివారం వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చాపిడి బాబాజీ, గజానంద్, మహేశ్, తిరుపతి ఉన్నారు.



రెబ్బెన లో సబ్ ఇంజినీర్ శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు